క్లుప్తంగా

ఉత్తమ వలంటీర్‌గా సోమశేఖర్



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న సోమశేఖర్

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం గ్రామ సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ సోమశేఖర్ ఉత్తమ ఆపదమిత్ర వలంటీర్‌గా ఎంపికయ్యారు. ఇందులో భాగంగానే సోమశేఖర్... జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సీఈఓ భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఆపదమిత్ర అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సోమశేఖర్‌ను అభినందించారు.

రేపు వారపు సంత వేలం

లేపాక్షి: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు వారపు సంతతో పాటు బస్టాండులో ఫీజులు వసూలుకు బహిరంగ వేలాన్ని సర్పంచ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. వారపు సంతకు రూ.30 వేలు, బస్టాండుకు రూ. 2 లక్షలు డిపాజిట్ చెల్లించిన తరువాతనే వేలం పాట పాడాలన్నారు.

అన్నదానానికి విరాళం

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో దాతల సహకారంతో నిర్మించిన అన్నదాన సత్రం నిర్వహణ కోసం హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని సోమవారం రూ. 50 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

శుభకార్యం

సోమందేపల్లి: మండల కేంద్రంలోని షిరిడినగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి తనయుడు అజయ్‌కుమార్ రెడ్డి, విద్యశ్రీ వివాహ రిసెప్షన్ సోమవారం వారి స్వగృహంలోనే జరిగింది. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ల విడుదల

రొద్దం: వచ్చే నెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ పోస్టర్లను సీపీఎం నాయకులు విడుదల చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు.

సామాజిక తనిఖీపై నేడు బహిరంగ సభ

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు, ఏపీఓ నాగరాజు తెలిపారు.

ఇళ్ల హక్కు పత్రాల పంపిణీ



హక్కు పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: తాలూకాలోని రెవెన్యూ గ్రామాలలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకటరమణప్ప ఇళ్ల హక్కు పత్రాలు సోమవారం అందించారు. గొల్లరహట్టి, లంబాణి, బోవి ప్రజలు నివసించే రెవెన్యూ గ్రామాల్లో సుమారు 200 మంది లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయంలో నిర్వహించిన హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, మున్సిపల్ అధ్యక్షురాలు ధనలక్ష్మి తదితర రెవెన్యూ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట



సోమందేపల్లి: మండలంలోని చిన్న బాబయ్యపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారామ, లక్ష్మణ, హనుమ విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. సోమవారం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఇంద్రజ, జెడ్పీటీసీ శ్రీరాములు, సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ సువర్ణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం





ద్వాక్రా మహిళలకు మెగా చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ

పెనుకొండ: మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వన్నికా ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ ఆసరా కింద 615 మహిళా సంఘాల సభ్యులకు 3వ విడతగా మంజూరైన రూ.3.4 కోట్ల మెగా చెక్‌ను పంపిణీ చేశారు. అంతకు ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ ద్వాక్రా సంఘాల మహిళలకు చెక్‌ను అందజేశారు.

మళ్లీ చంద్రబాబును నమ్మొద్దు

ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ గత మూడేళ్లలో ప్రతి కుటుంబంలో సంతోషాలు నిండాలని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారన్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, నేతన్న నేస్తం, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాలతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. ఎన్నో ఇబ్బందులున్నా మాటకు కట్టుబడి సంక్షేమ ఫలాలకు సంబంధించిన లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే మళ్లిస్తున్నారని చెప్పారు. లక్షల కోట్ల రూపాయలను ప్రజలకు ఇచ్చి చరిత్రలో ఎవరూ చేయని విధంగా ప్రజలకు సంక్షేమ లబ్ధిని చేకూరుస్తున్నారని కొనియాడారు. గతంలో చంద్రబాబు మహిళలకు ద్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. 20 వేల కోట్ల అప్పులు ఉంటే కేవలం రూ. 2 వేల కోట్లను ద్వాక్రా రుణాల కింద మాఫీ చేశారన్నారు. గ్రామాలు, పట్టణాల్లో బాబొస్తే జాబు అని, ద్వాక్రా రుణాల మాఫీ అని, బ్యాంకుల్లో బంగారు మీ ఇంటికి వస్తాయని ఇలా ఎన్నో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక మరచిపోయారన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ద్వాక్రా మహిళలకు పావలా, సున్నా వడ్డీ కింద క్రమం తప్పకుండా రుణాలు అందించినట్లు తెలిపారు. పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడుతూ వారి గౌరవానికి భంగం కలిగిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. 3వ విడతను పరిగణలోకి తీసుకుంటే ద్వాక్రా మహిళలకు రూ. 19 వేల కోట్ల మేర లబ్ధి చేకూర్చారన్నారు. ఈబీసీ, వైఎస్సార్ చేయూత కింద మహిళలకు లబ్ధి చేకూర్చి ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. చంద్రబాబు మాటలకు ప్రజలు మోసపోవద్దని, ఆయనకు అధికారం ఇస్తే అన్ని పథకాలు ఎత్తేసి ప్రజలను కష్టాల్లోకి లాగేస్తారన్నారు.

జగనన్నకు అండగా నిలవాలి

ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ చంద్రబాబు కపట మాటలు నమ్మితే మహిళలకు ఇబ్బందులు తప్పవని స్పష్టం చేశారు. అక్కచెల్లెమ్మలను ఆదరిస్తున్న జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ చైర్మన్‌లు సునీల్, జయశంకరరెడ్డి, నందిని, జెడ్పీటీసీ శ్రీరాములు. ఎంపీపీ గీత, మాజీ ఎంపీటీసీ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు బోయ నరసింహ, నాగలూరు బాబు, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, సద్దాం, భాస్కర్‌నాయక్, పొగాకు రామచంద్ర, మునిమడుగు శ్రీనివాసులు, నటేష్, ఫరీద్, యాసిన్, నేమతుల్లా, బోయబాబు, మండల వ్యవసాయ కమిటీ సలహాదారు కొండలరాయుడు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు స్వల్ప గాయాలు

అమరాపురం: స్థానిక తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సురేష్‌కుమార్‌కు స్వల్ప గాయలయ్యాయి. వివరాల్లోకి వెళితే... తహసీల్దార్ సురేష్‌కుమార్ మడకశిర రోడ్డులో సోమవారం రాత్రి వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఆయన కింద పడిపోవడంతో చేయి విరిగింది. దీంతో వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం అనంతపురం తీసుకెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

మడకశిర: నియోజకవర్గంలో ఆరు కేంద్రాల్లో సోమవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 1,685 విద్యార్థులకుగాను 1,651 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరయ్యారు. 34 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మడకశిర జూనియర్ కళాశాలలో 393 మందికి గాను 381 మంది హాజరయ్యారు. ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 391 మందికి గాను 388 మంది హాజరయ్యారు. వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 263 మందికిగాను 252 మంది హాజరయ్యారు. అగళిలో 184 మందికి గాను 181 మంది హాజరయ్యారు. అమరాపురంలో 234 మందికి గాను 231 మంది హాజరయ్యారు. గుడిబండలో 220 మందికిగాను 218 మంది హాజరయ్యారు. నియోజకవర్గంలోని కొన్ని పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ సభ్యులు లక్ష్మీకాంతరెడ్డి, రంగయ్య తదితరులు తనిఖీ చేశారు.

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీలో ఇంటర్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయి. సోమవారం ద్వితీయం సంవత్సర విద్యార్థులకు ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 321 మంది హాజరుకావాల్సి ఉండగా... అందులో 314 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వాల్మీకులు

గుడిబండ: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేయడం హర్షణీయమని వాల్మీకి సోదరులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని కొంకల్లులో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ కె.శివకుమార్ ఆధ్వర్యంలో వాల్మీకులు మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఓబన్న, హనుమంతరాయప్ప, రంగప్ప, ఈరన్న, రామంజి, కేశవ్, రంగస్వామి, కరుణాకర్, చిరు, శ్రీరామప్ప, బొమ్మ లింగప్ప పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న మంజువాణి

రొద్దం: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పెనుకొండ డివిజన్ వైద్య,ఆరోగ్యశాఖ అధికారి మంజువాణి సిబ్బందికి సూచించారు. సోమవారం మండల పరిధిలోని బొక్సంపల్లిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ అమలుపై డాక్టర్ జగదీశ్‌బాబును అడిగి తెలుసుకున్నారు. వచ్చిన రోగులకు రాండమ్ బ్లడ్ షుగర్, బీపీ తదితర పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇవ్వాలన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



అమరాపురం: సరస్వతీ పూజ చేస్తున్న పదో తరగతి విద్యార్థులు

అమరాపురం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని హెచ్ఎం.నాగేంద్రకుమార్, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సరస్వతీ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ చిత్ర పటానికి అర్చకులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే సరస్వతీ మంత్రాన్ని పలికించారు.

లేపాక్షి: మండలంలోని కంచిసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు సాయినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హిందూపురం టౌన్: స్థానిక సీ.చెర్లోపల్లి ఆదర్శపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థినులు జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన కోమలి, అమృత, స్వరూప, దీక్షితలను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

గుడిబండ: మండల పరిధిలోని ఎస్.రాయాపురం ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గగన్ అనే విద్యార్థి ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభ చూపి స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు హెచ్ఎమ్ మారుతీ తెలిపారు.

రైతు ఉత్పత్తి దారుల సంఘం ఎన్నిక

అమరాపురం: మండలంలోని మహిళా రైతుల ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి దారుల సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. సోమవారం ఏపీఎం తిప్పన్న మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. మండల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షురాలిగా కవిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 11 పంచాయతీలకు ఒక్కొక్క డైరెక్టర్‌ను ఎన్నుకున్నారు.

చిరు వ్యాపారులకు రుణాలు

అమరాపురం: చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి సహకారం సంఘం ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు చిక్కన్న తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ పూలు, పండ్లు, చిరు అంగళ్లు, ఐస్‌క్రీం తయారీ, గాజుల షాపు, కాస్మొటిక్స్ తదితర వ్యాపారాలు చేసుకునే వారికి సొసైటీ ఆధ్వర్యంలో 7 శాతం వడ్డీతో రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' చెక్కుల పంపిణీ

పరిగి: మండల కేంద్రంలోని డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మంజూరైన మెగా చెక్కు పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. బీరప్ప ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

మడకశిర(అగళి): అగళిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి అతిథిగా హాజరవుతారన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని నంది విగ్రహం వెనుక ఉన్న ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం వైఎస్సార్ ఆసర మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరసింహానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యకమానికి ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అతిథిగా హాజరవుతారన్నారు.

పోషణ్ పక్వాడాపై అవగాహన

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని సిబ్బందికి పోషన్ పక్వాడాపై సూపర్ వైజర్ సుజాత ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. రక్తహీనత బారిన పడకుండా బాలికలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం చిరుధాన్యాల విశిష్టతను హైస్కూల్ విద్యార్థులకు వివరించారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

చిలమత్తూరు: చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్వహణపై ఏప్రిల్ 3 వరకు జరిగే శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. సోమవారం కోడూరు మర్రో తోపు వద్ద ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద అధికారులు హిందూపురం, గుడిబండ మండలాలకు చెందిన కార్యదర్శులు, సర్పంచులు,గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఇచ్చారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడపల్లి సమీపంలో ఓ లగేజీ ఆటో బోల్తా పడింది. అయితే ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. అమరాపురం నుంచి లగేజీ ఆటోలో ఇళ్ల నిర్మాణానికి ఇనుప కడ్డీలను సోమవారం సాయంత్రం నాగేపల్లి గేటుకు తీసుకెళ్తుండగా తమ్మడేపల్లి సమీపంలో ఆటో బోల్తా పడింది. డ్రైవర్‌కు గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది.

అక్రమ లేఅవుట్ తొలగింపు

మడకశిర: పట్టణంలోని ఆదిరెడ్డిపాళ్యంలో అక్రమంగా వేసిన లేఅవుట్‌ను సోమవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. జేసీబీతో లేఅవుట్‌కు వేసిన రాళ్లను పూర్తిగా తొలగించారు. మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలంగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే తిప్పేస్వామి సూచించారు. సోమవారం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మడకశిర అర్బన్, మడకశిర రూరల్ పరిధిలోని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధుల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు కీలక పాత్ర పోషించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నమ్మకాన్ని నిలబెట్టాలని కోరారు. సాధారణ ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, ఇప్పటి నుంచే ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. కలిసికట్టుగా పని చేసి వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, జేసీఎస్ అర్బన్, రూరల్ కన్వీనర్లు విక్రమ్, నాగేంద్ర, డైరెక్టర్ నాగరాజగౌడ్, నాయకులు జయరాజ్, నాగేంద్ర, సత్యనారాయణరెడ్డి, జమ్మానిపల్లి మూర్తి, లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మడకశిర: మడకశిరలో సోమవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. రొళ్ల, అమరాపురం మండలాలకు చెందిన ఇద్దరికి రూ.1.30 లక్షలు సీఎం సహాయనిధి కింద మంజూరైంది. ఆ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందించారు.

ఇసుక రీచ్ రద్దు చేయాలి



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న సీఐ కరుణాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

పరిగి: మండల పరిధిలోని జయమంగళీ నదిలో అధికారులు అనుమతులు ఇచ్చిన ఇసుక రీచ్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రీచ్ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసనకు దిగారు. ఇటీవల నదుల్లో విస్తృతంగా పారిన వరద నీటికి కొట్టుకొచ్చిన ఇసుకను స్థానిక ప్రజల నిర్మాణాల అవసరాలకు మాత్రమే వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక తరలించకుండా టిప్పర్ వాహనాలను అడ్డుకొని కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. సమాచారం తెలుసుకున్న పెనుకొండ సీఐ కరుణాకర్, ఎస్ఐ నరేంద్ర, రొద్దం, పెనుకొండ కియా ఏరియా ఎస్ఐలు నాగస్వామి, వెంకటరమణ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇసుక రీచ్‌ను వ్యతిరేకిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలతో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీపీ సవిత ప్రభాకర్, సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ చంద్రారెడ్డి, జెడ్పీటీసీ శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ ఉత్సవాలు ప్రారంభం

రొళ్ల: మండల పరిధిలోని రొళ్లగొల్లహట్టితండాలో సోమవారం రాత్రి మారెమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారి శిలావిగ్రహాన్ని అభిషేకించి పూజలు చేశారు. మంగళవారం మారెమ్మదేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంతో పాటు అన్నదానం ఉంటుందన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

హిందూపురం: విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు సామాజిక సేవపై అవగాహన పెంచుకోవాలని బాలయేసు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం కొటిపి పంచాయతీలోని ఇస్లాంపురంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామంలో రహదారులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అశ్వర్థనారాయణ, రఘు,హరిష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

మడకశిర రూరల్: మండల పరిధిలోని రేకులకుంట బాలుర గురుకుల పాఠశాల వార్షికోత్సవం సోమవారం రాత్రి ప్రిన్సిపాల్ ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సరస్వతీపూజ నిర్వహించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాళ్లు మురళీధర్‌రావు, రామంజనేయరెడ్డి, జ్యోతి, పాఠశాల చైర్మన్ నరసేగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర అభివృద్ధికి కృషి

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని నూతన డీఎం రామసుబ్బయ్య తెలిపారు. ఆయన సోమవారం తనను కలిసిన విలేకర్లతో మట్లాడుతూ మడకశిర డిపోను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా డిపో ఆదాయాన్ని పెంచడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

● కొండ రోడ్డు సిద్ధం

పెనుకొండ: పట్టణంలోని కొండ రోడ్డు పనులు పూర్తయ్యాయి. పర్యాటకంగా పెనుకొండను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కీలకమైన కొండ రోడ్డును పనులు మొదలు పెట్టారు. పనులు మధ్యలోనే ఆగిపోవడంతోనే ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ప్రత్యేక చర్యలు చేపట్టి పనులను పూర్తి చేయించారు. రూ.14 కోట్లతో రోడ్డు పనులు పూర్తవగా త్వరలో రోడ్డును ప్రారంభించనున్నారు. అలాగే కొండపైన విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు సాగుతున్నాయి. దీంతో కొండపై లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి మార్గం సుగమమైంది.



పూర్తయిన కొండ రోడ్డు